ఒక్కసారి అవకాశం ఇవ్వండి

● ఓటర్లకు జగదీశ్వర్‌గౌడ్ విజ్ఞప్తి



మై హోం మంగళలో ఓటర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: ఒక్కసారి అవకాశం ఇస్తే మీ వెంటే నేను ఉంటానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని మై హోం మంగళ గేటెడ్ కమ్యూనిటీలో ఓటర్లతో సమావేశమయ్యారు. మూడుసార్లు కార్పొరేటర్‌గా సేవలందించానని, సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రజలకు మేలు చేస్తుందన్నారు.

ప్లీజ్...నాన్నకు ఓటేయ్యండి

నాన్నకు ఓటేయండి ప్లీజ్ అంటూ కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ కూతురు హారిక ఇంటింటి ప్రచారం చేస్తోంది. శనివారం కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో కాంగ్రెస్ హామీల కరపత్రాలు పంచుతూ ప్రచారం చేసింది. ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మాకు మద్దతివ్వండి..



జమీర్‌ను కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు జమీర్‌ను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హస్తం గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్ని వర్గాలకు అండగా ఉండి నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ సమావేశంలో హఫీజ్‌పేట్ డివిజన్ మైనార్టీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ శనివారం నల్లగండ్లలోని లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రకటించిన ఆరు హామీలతో పాటు శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

రవికుమార్‌కు బీసీ ఐక్య వేదిక మద్దతు



బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్‌ను కలిసిన బీసీ నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్‌కు బీసీ ఐక్యవేదిక నాయకులు మద్దతు తెలిపారు. శనివారం మసీద్‌బండలోని కార్యాలయంలో రవికుమార్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీ గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రామచందర్ , రమేష్‌కుమార్ యాదవ్, సురేష్, సదానంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుంటా

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్‌యాదవ్



కొండాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్, రఘునాథ్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

గచ్చిబౌలి: కాంగ్రెస్ శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు రఘునాథ్‌యాదవ్ స్పష్టం చేశారు. కొండాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిన మేరకు జగదీశ్వర్‌గౌడ్‌కు అవకాశం రావడంతో ఆయనకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ వయస్సులో చిన్నవాడైనా పెద్ద మనస్సుతో ముందుకొచ్చి తనకు మద్దతు ప్రకటించడం రఘునాథ్‌యాదవ్ పరిపక్వతకు నిదర్శనమన్నారు. అంతా కలిసికట్టుగా ముందుకు సాగుతామన్నారు. ఏఐసీసీ అధికార ప్రతినిధి షమీమ్ మహ్మద్, నాయకులు మహిపాల్‌యాదవ్, టి కృష్ణ, రాములుగౌడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి శ్రిష్టి పందరి కీర్తన, శబ్దం, దేవవర్ణమా, అష్టపది అభాంగ్, అంశాలను ప్రదర్శిం చారు. నృత్యాంజలి డ్యాన్స్ అకాడమి గురువు ప్రసన్నమోహన్ శిష్యబృందంచే అలరిపు, మూషికవాహన, కౌత్వం, శబ్దం, పదం, దేవి స్తుతి, దుర్గే దుర్గే, నటనమాడిన తదితర అంశాలతో ఆకట్టుకున్నారు. కళాకారులు శ్రీప్రియ, నేహశ్రీ, సంజన, యశస్వినీ, శివాని, వర్ష, శ్రీహిత, పియూష జోషిక, ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలి

బీఆర్ఎస్ అభ్యర్థి ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, రాజీవ్‌నగర్, హుడా ఫేజ్ 2, వెంకటేశ్వర్‌నగర్, శివాజీనగర్ వీకర్ సెక్షన్, సిటిజన్ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాల ద్వారా మంచినీరు అందిస్తున్నారన్నారు. నిరంతర విద్యుత్, వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తోడ్పడే విధంగా మ్యానిఫెస్టో ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఆసరా పెన్షన్ల పెంపు, దివ్యాంగుల పెన్షన్, రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం మహిళలకు పెద్ద ఉపశమన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, రాఘవరావు, రఘుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, యాదగిరి గౌడ్, జనార్ధన్‌రెడ్డి, గురుచరణ్ దూబె, పులిపాటి నాగరాజు, లక్ష్మారెడ్డి, ఓర్సు వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేస్తాం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగురవేస్తామని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. శనివారం చందానగర్ డివిజన్ శివాజీనగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్నారు. శివాజీనగర్ వీకర్ సెక్షన్ కాలనీ, సిటిజన్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణగౌడ్, మోహన్‌గౌడ్, రఘుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిరియాల రాఘవరావు, యాదగిరిగౌడ్, జనార్ధన్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, ఉరిటి వెంకట్రావ్, ప్రవీణ్, వాసిలి చంద్రశేఖర్, గురుచరణ్ దూబే, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చందానగర్ డివిజన్ పరిధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ , కార్పొరేటర్ మంజుల



శివాజీనగర్‌లో ప్రచారంలో పాల్గొన్న గాంధీ తదితరులు



ప్రశాంత్‌హిల్స్, సాయిఐశ్వర్య, వైభవ్ కాలనీల్లో ఇంటింటి ప్రచారంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా

ఆత్మీయ సమావేశం

మాదాపూర్: రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్‌దే విజయమని ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని మైహోమ్ నవదీప అపార్ట్‌మెంట్స్ వాసులతో ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళ, కేసీఆర్ కిట్, కంటివెలుగు, రైతు బంధు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటివి విజయవంతంగా చేసినట్టు తెలిపారు.



మసీదుబండలో బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీని గజమాలతో సత్కరించిన స్థానికులు, నాయకులు

గాంధీ విజయం ఖాయం

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ధీమా వ్యక్తం చేశారు. శనివారం గచ్చిబౌలి డివిజన్ ప్రశాంత్ హిల్స్, సాయివైభవ్, సాయిఐశ్వర్య కాలనీలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, రాజునాయక్, చెన్నంరాజు, అనిల్, నరేష్, సతీష్, అంజమ్మ, రాజుముదిరాజ్, జగదీశ్, ఆకుల యదగిరి, రమేష్‌గౌడ్, నారాయణ, కల్పన పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

మియాపూర్: ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే గాంధీని గెలిపించుకుందామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్, ప్రజయ్ షెల్టర్, సాయిజ్యోతినగర్, డాక్టర్స్ రెడ్డీస్ కాలనీలలో నాయకులు, కార్యకర్తలతో కలసి శనివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ పూలదండలతో సత్కారం

గచ్చిబౌలి: కాలనీలు, బస్తీలలో ఎన్నికల ప్రచారానికి వెళుతున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీని నాయకులు, కార్యకర్తలు, స్థానికులు గజమాలలతో స్వాగతం పలుకుతున్నారు. శనివారం సాయంత్రం మసీదుబండలో ప్రచారానికి వచ్చిన గాంధీని స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఇతర నాయకులు, గజమాలతో సత్కరించారు.

అభివృద్ధే నా స్వప్నం

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు
- నియోజకవర్గం ప్రగతికి మరింత కృషి
- బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సంక్షేమం, అభివృద్ధే నా స్వప్నమని, ప్రజలందరూ ఆలోచించి ఓటు వేసి ప్రగతికి పట్టం కట్టాలని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ మండే మార్కెట్ నుంచి జయలక్ష్మినగర్, లక్ష్మిసాయి మెడోస్, వందనపురి కాలనీ మీదుగా బాలాజీ కన్వెన్షన్ సెంటర్ వరకు వేలాదిమందితో భారీ రోడ్‌షో చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న అమీన్‌పూర్ గ్రామాన్ని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసి నాలుగేళ్ల కాలంలో రూ.150 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. బీరంగూడ నుంచి కృష్ణారెడ్డిపేట మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు రూ.65 కోట్లతో రహదారిని విస్తరించామని తెలిపారు. అదేవిధంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.120 కోట్లతో ఐదు రిజర్వాయర్ నిర్మించినట్లు వివరించారు. మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, గూడెం సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గూడెం విక్రమ్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.



బీరంగూడ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాను..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్‌లో మాజీ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ భూపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్‌షోతో పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ పటాన్‌చెరు

పటాన్‌చెరు: అభివృద్ధికి కేరాఫ్‌గా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీపూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని రెయిన్‌బో మెడోస్ కాలనీ, మున్సిపల్ పరిధిలోని తులసివనంలో కాలనీలలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతాసత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీనగర్, శాంతినగర్ కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డిలో కలిసి పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ సపానదేవ్, నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం ముమ్మరం..

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లక్ష్మీపతిగూడెం, చౌదరిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాయికోటి రాజేష్, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిపాల్‌రెడ్డి విజయం ఖాయం

పటాన్‌చెరు టౌన్: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పటాన్‌చెరు పట్టణంలో ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ మేనిఫెస్టోతో పాటు ఎమ్మెల్యే ప్రవేశపెట్టిన నవరత్నాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి మహిపాల్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి ఓటర్లు 7,32,506

- పురుషులు 3,88,482
- మహిళా ఓటర్లు 3,43,875

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఓటర్ల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. తాజాగా విడుదల చేసిన ఓటరు జాబితాలో ఓటర్ల సంఖ్య 7,32,506 కు చేరింది. కొత్తగా నమోదు చేసుకున్న యువ ఓటర్లను జాబితాలో చేర్చారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న శేరిలింగంపల్లి ఐటీ కంపెనీలు, ఐటీ ఆధారిత ఉద్యోగులకు నిలయంగా మారింది. అంతే కాకుండా నిర్మాణ రంగం ఊపు మీద ఉండటంతో వలస కూలీలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఉద్యోగులు వస్తున్నారు. ఇటీవల విడుదల చేసి జాబితాలో 7.8 లక్షల ఓటర్లు ఉన్నారు. తాజాగా విడుదల చేసిన జాబితాలో మరో 14 వేల ఓట్లు పెరిగాయి. దీంతో మొత్త ఓటర్ల సంఖ్య 7.32 లక్షలకు చేరింది. మొత్తం ఓటర్లు 7,32,506 ఓటర్లు ఉండగా పురుషులు 3,88,482, మహిళ ఓటర్లు 3,43,875 ఇతరులు 149 మంది ఉన్నారు. మొత్తం 622 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వికలాంగులు 5,407 మంది ఓటర్లు ఉండగా పురుషులు 3,067, మహిళలు 2,340 మంది ఉన్నారు. 80 ఏళ్లకు పై బడిన ఓటర్లు 8,102, పురుషులు 4,518, మహిళలు 3,582, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 27 మంది ఉండగా మహిళలు 7గురు, పురుషులు 20 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 54 మంది ఉండగా పురుషులు 44 మంది, మహిళలు 10 మంది ఉన్నారు.